ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : జి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 సంచిక : 10 జూన్ 2024

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V.
సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342


## ఈ సంచికలో. . . .

మనస్సుని ఒకే భావం మీద నిలబెట్టి ఉంచటమే జపము, ధ్యానము ........................................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 4

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



హృదయంలో ఉన్న సత్యానుభవం నీకు కలిగినప్పుడు, ఆనందమే ఆనందము, శాంతే శాంతి, సుఖమే సుఖము. నీ హృదయంలో ఉన్న సుఖం రవ్వంత, ముల్లంత నీ సహస్రారానికి అందినా అది నీ హృదయంలోనికి లాక్కొనిపోతుంది.

# మనస్సుని ఒకే భావం మీద నిలబెట్టి ఉంచటమే జపము, ధ్యానము

(శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి సేకరణ)

మనస్సుని అవసరమైనప్పుడు ఉపయోగించుకొని దానిని ఒక పక్కన పెట్టేయండి. దాని జోలికి అస్తమానూ వెళ్ళకండి. దానిని రెచ్చగొట్టకండి. వాడు మంచివాడు కాదు. వాడు దుర్మార్గుడు వాడి గొడవలోకి వెళ్ళొద్దు అని చెపుతూ ఉంటారు కదా. అలాగే మనస్సు గొడవలోకి రోజూ వెళ్ళకండి. కంచంలో అన్నం తిన్నట్టు అవరసరమైనప్పుడు ఉపయోగించుకొని ఒక పక్కన పెట్టేయండి, మనస్సు అంటేనే అశాంతి, మనస్సు అంటేనే డిస్టర్బెన్స్ (disturbance). అస్తమానూ రోజూ దానిని తలపెట్టుకోకండి. అవసరమైనప్పుడు ఉపయోగించుకొని దానిని పక్కన పెట్టేస్తూ ఉండండి. వ్యాపకాలు పెంచుకోకండి. వ్యర్థమైన ఆలోచనలు, వ్యర్థమైన కోరికలు ఏమీ పెంచుకోవద్దు, మీ మనస్సుని ఒకే భావం మీద, ఒకే తలంపు మీద నిలబెట్టి ఉంచండి, అదే జపము, అదే ధ్యానము. మీకు రాత్రి ఎప్పుడైనా నిద్రపట్టకపోతే, మీకు ఇష్టమైన నామం అనుకోండి, పైకి అనక్కరలేదు, మనస్సులోనే, రామః శ్రీ రామః శరణం మమ, ఓం నమో నారాయణాయ, ఓం నమో భగవతే వాసుదేవాయ, నారాయణ, నారాయణ, అలా అనుకుంటా ఉండండి. ఆ పేరు ఎవడైతే పెట్టుకున్నాడో, వాడి దగ్గరనుంచి మీకు సమాధానం వస్తుంది. "సుబ్బమ్మ, సుబ్బమ్మ, సుబ్బమ్మ, అలా పదిసార్లు అంటూ వుంటారు అనుకోండి, ఏంటి ఇన్ని సార్లు పిలుస్తున్నాడు అని మన పిలుపుకి తట్టుకోలేక సుబ్బమ్మ వచ్చేస్తుంది.

ఈ మధ్యన ఒక అబ్బాయి వాళ్ళ అమ్మతోటి, మా అమ్మాయి పెళ్లి నువ్వే చెయ్యాలి అంటున్నాడు. మా అమ్మాయికి కట్నం ఇచ్చి పెళ్లి చేసే శక్తి నాకు లేదు, నీ దగ్గర ఏదో ఉంది కదా, అమ్మా నువ్వే చెయ్యాలి అంటూ వుంటే ఒక సంవత్సరం ఊరుకుంది. చివరికి, సరేలే సంవత్సరం నుంచి అడుగుతున్నావు చూస్తానులే అంటోంది వాళ్ళ అమ్మ. బంగారం ఖర్చు, బట్టల ఖర్చు, బజంత్రీల ఖర్చుతో సహా భరిస్తాను అంటోంది. ఏంచేస్తుంది మరి అస్తమానూ అంటూవుంటే! దేవుడు కూడా అంతే, నారాయణ, నారాయణ, నారాయణ, లేకపోతే వాసుదేవ వాసుదేవ వాసుదేవ అంటూ వుంటే, ఆ నామం ఎవరికి వుందో వాళ్ళ దగ్గర నుంచి మనకి

స్పందన వస్తూ ఉంటుంది. మీరు చేసే జపం ఊరికే వృథా పోదు. తప్పనిసరిగా ఆ దేవతా పురుషుడి దగ్గరి నుంచి స్పందన వస్తుంది. అరుణాచలం అరుణాచలం అరుణాచలం అనుకుంటా వుంటే అక్కడినుంచి మీకు రెస్పాన్స్ వచ్చి తీరుతుంది. ఈమధ్యన ఒకాయన వాడికి ఆ పని చెయ్యను అని చాలా సార్లు అన్నారు, మరి ఎందుకు చేసారు అంటే వాడి గొడవ వదిలించుకోవటానికి చేసాను అన్నారు. అలాగే మీకు ప్రార్థన వల్ల, జపం వల్ల కూడా. ప్రతిస్పందన వస్తుంది. ఆ దేవతానుగ్రహం, ఆ దేవతాపురుషుడి దగ్గరినుంచి ఎంతోకొంత గ్రేస్ వస్తుంది. మీకు లక్ష్మి అని పేరు ఉందనుకోండి, లక్ష్మీ నీవల్లే అవ్వాలమ్మా ఈ పని అంటే, ఆ లక్ష్మికి స్పందన వస్తుంది కదా. అలాగే దేవతాపురుషులకి కూడా – సుబ్రహ్మణ్యుడు, నారాయణుడు, లేకపోతే శంకరుడు, ఇలా ఆ పేరు ఉన్న వాళ్ళ దగ్గరినుంచి మీకు ఆ స్పందన, రెస్పాన్స్ వస్తుంది ఈనాటికైనా ముందు నాటికైనా. అంటే జపం యొక్క ఫలితం, ప్రార్థన యొక్క ఫలితం ఊరికే పోదు. మీకు ఆ ప్రయత్నం వేస్ట్ అవ్వదు.

ఇప్పుడు మీకు ఒక తలంపుకి ఇంకొక తలంపుకి సంబంధం ఉండటం లేదు. ఒక కోరికకి ఇంకొక కోరికకి సంబంధం ఉండటం లేదు. అస్తవ్యస్తంగా ఉన్నాయి. మనస్సు నిదానంగా ఉండాలంటే, మీ హృదయం యొక్క లోతులు పెరగాలంటే, మీ హృదయం విశాలం అవ్వాలంటే, అస్తవ్యస్తంగా ఉన్న తలంపులన్నీ పోయి ఒక నిదానమైన తలంపు రావాలంటే జపమూ అవసరమే ధ్యానమూ అవసరమే. ఒకే ఆలోచన మీద, ఒకే తలంపు మీద నిలవటమే ధ్యానం. ఆ ధ్యానం అలా కొనసాగాలి. తరువాత ఇంకొకటి ప్రయత్నం చేసేటప్పుడు మనకి ఓర్పు ఉండాలి. ఏదైనా ఒక పని మొదలు పెట్టాము అనుకోండి, ఆ పని యొక్క ఫలితం మీదే దృష్టి ఉంటుంది కాని ఆ పని చేయటానికి ఓర్పు ఉండాలి అని మనకు ఉండదు. ఆ పని చేయటానికి తగినంత ఓర్పు ఉంటే, ఫలితం కోరకుండా వస్తుంది. ఇక్కడ మీరు అర్థం చేసుకోవలసినది ఏమిటంటే, మీరు ఓర్పు పని యందు చూపించాలి, ఫలితం యందు కాదు. మనం ఓర్పుగా పని చేస్తే, లౌకికమైన ఫలితమే కాదు, మోక్షం కూడా వస్తుంది. అయితే మనకు టాలరెన్స్ లేదు. పని మొదలు పెట్టాక మనకెంతసేపూ ఫలితం మీదే దృష్టి. కాని, మనం ఆ పని పూర్తి చేయాలంటే ఎంతో సహనం ఉండాలి, ఎంతో ఓర్పు ఉండాలి.

**సేకరణ: యూట్యూబ్:** https://www. youtube. com/watch?v=H31fOLpVZfc

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 4 ఫిబ్రవరి 1996, మార్టేరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

చదువు, డబ్బు, అధికారం మనిషికి అవినయం తీసుకువస్తాయి, అంటే గర్వాన్ని తీసుకువస్తాయి. గర్వం వల్ల మనం పాడవుతాము. అందుచేత మీలో ఎవరికైనా భౌతిక శక్తులు ఉన్నప్పటికీ, సాధన చేసేవాళ్ళు గర్వం రాకుండా చూసుకోవాలి, గర్వం వస్తే పతనమై పోతాము. అందుచేత పెద్దలు ఏమని చెప్పారు అంటే వినయం కాపాడుకోమని చెప్పారు. ఎంత ఎక్కువ చదువు ఉంటే, ఎంత ఎక్కువ ధనం ఉంటే, ఎంత పెద్ద అధికారం ఉంటే మనం అంత వినయంగా ఉండాలి, జాగ్రత్తగా ఉండాలి. అది సాధకుడు యొక్క లక్షణం. ఏ సాధన చేసినా వినయం ఉండాలి, మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం కూడా ఉండాలి.

ఒక ఉపనిషత్తులో ఏమని చెప్పారు అంటే అజాగ్రత్త పరులకి ఆత్మ తెలియదు అన్నారు. కొంతమంది మనుషులు భౌతికమైన విషయాలలో కానీ, ఆధ్యాత్మికమైన విషయాలలో కానీ అజాగ్రత్తగా ఉంటారు, జాగ్రత్తగా ఉండరు. అజాగ్రత్తగా ఉండే మనుషులకి, మతిమరుపు మనుషులకి వస్తువు తెలియదు. అంటే మీ సంసార విషయాలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నారో, ఈ ఆధ్యాత్మిక విషయంలో కూడా అంత జాగ్రత్తగా ఉంటే అది వస్తుంది కానీ అజాగ్రత్తగా ఉంటే రాదు. మీరు ఏదైనా ధనం సంపాదించాలి అంటే, విద్య సంపాదించాలి అంటే, కష్టపడకుండా రావడం లేదు. ఇవి ఒకరోజున ఉండి మరుసటి రోజున కనపడవు. ఈ చదువులు, ఈ గౌరవాలు, ఈ సన్మానాలు, ఈ పూజలు, ఈ ఊరేగింపులు, ఇవన్నీ దేహం ఎంత నిజమో అవి అంతే నిజం. అసలు దేహమే మనం కాదు. ఇవి చూసుకుని మనం గర్వం తెచ్చుకోకూడదు. గర్వం తెచ్చుకుంటుంటే భౌతికంగా పతనం అయిపోతాము, ఆధ్యాత్మికంగా పతనం అయిపోతాం. అందుచేత మనం చేయవలసినది ఆధ్యాత్మిక కృషి కానీ, భౌతిక కృషి విషయంలో జాగ్రత్తగా ఉండాలి, అజాగ్రత్త పనికిరాదు.

భగవాన్ ఏమని చెబుతున్నారంటే చాలామంది పాడైపోవడానికి రెండు కారణాలు

చెబుతున్నారు. ఒకటి సహవాస దోషం, రెండు అలవాట్లలో లోపాలు. మనకి అవసరమైన దానికంటే ఎక్కువ తింటున్నాము, అవసరమైన దానికంటే ఎక్కువ నిద్రపోతున్నాము, రోజూ మాట్లాడడం అలవాటు అయ్యిపోయి మాట్లాడడం అవసరం లేనప్పుడు మౌనంగా ఉండటం మానేసి మాట్లాడడమే పనిగా పెట్టుకుంటున్నాము, వీటివల్లే పాడైపోతున్నాము అంటున్నారు. మాటలకు బాగా అలవాటు పడిపోయి ఒక గంట కుదురుగా కూర్చోమంటే కూర్చోరు, మౌనంగా ఉండమంటే ఉండలేరు. ఎందుచేత? మౌనం యొక్క విలువ తెలియక ఆ మౌనాన్ని అభ్యాసం చెయ్యలేక పోతున్నారు. సహవాసాల విషయంలో, అలవాట్ల విషయంలో జాగ్రత్తగా ఉండలేకపోతున్నారు. అందుకే మన మనస్సు పాడవుతోంది. అందుచేత మనస్సుని బాగు చేసుకోవడం కూడా కష్టం అవుతుంది.

ఇక్కడ మనం గ్రహించవలసినది మనస్సులో ఆరోగ్యం ఉండాలి, శరీరంలో ఆరోగ్యం ఉండాలి. మన ఇంద్రియాలు మన స్వాధీనంలో ఉండవు అనుకోండి, మన శరీరం మన స్వాధీనంలో ఉండదు అనుకోండి, మన మనస్సు కూడా స్వాధీనంలో ఉండదు అనుకోండి, అప్పుడు మన లోపల ఉన్నటువంటి ఏకంగా ఉన్న వస్తువుని, నిదానంగా ఉన్న వస్తువుని, సత్యవస్తువుని, తెలుసుకునే సమస్యే లేదని ఇక్కడ భగవాన్ చెబుతున్నారు. కొంతమంది చిన్నమాట అంటే పడలేరు, వాళ్ళ ఫీలింగ్ తొందరగా హర్ట్ అవుతుంది. అంటే వాళ్ళ మెదడులో దోషం. కొంతమంది విషయాన్ని తొందరగా గ్రహించలేరు, కానీ ఓర్పుగా ఉంటారు, సూక్ష్మబుద్ధి తక్కువగా ఉంటుంది. అందుచేత అన్ని కళ్యాణగుణాలు కూడా మన మెదడులోకి రావాలి అంటే ఈశ్వరానుగ్రహం లేకుండా అవి రావు. మనకు మెదడులో ఉన్న అన్ని కోణాలు వికసిస్తే, జీవితంలో ఇంక మనకి వెలితి కనపడదు. అంటే పూర్ణస్థితి మనకి తెలుస్తుంది.

బ్రాహ్మీస్థితి నీకు ఎప్పుడు కలుగుతుంది అంటే, బ్రహ్మం పట్ల నీకు నిష్ఠ కలగాలి. అంటే ఆత్మనిష్ఠ వల్ల ఆత్మ తెలియబడుతుంది. మనం మాట్లాడే మాటలు, మనం చేసే పనులు, మన శరీరం, మన మనస్సు, మన ఇంద్రియాలు మనకి సహకరించకపోతే ఆత్మనిష్ఠ మనకి కుదరదు. మన ఇంద్రియాలే మనకి సహకారం చేసి పెట్టాలి. మన మనస్సు

మనకి సహకారం చేసి పెట్టాలి. మీకు ఫుడ్ హేబిట్స్ కనుక కరెక్ట్‌గా లేకపోతే, మీ శరీరం కానీ, మీ మనస్సు కానీ, మీకు సహకారం చేసి పెట్టదు. మనస్సు యొక్క ఆలోచనల్లో ఉన్న దోషాల వల్ల, ఆహారనియమం సరిగ్గా పాటించకపోవడం వల్ల, చెడు అలవాట్ల వల్ల, చాలామందికి అనారోగ్యం వస్తుంది, దారిద్ర్యం వస్తుంది. చెడ్డ అలవాట్లలో కనుక పడితే మనిషికి ఒకటి అనారోగ్యం, రెండు దారిద్ర్యం – ఇవి రెండూ వస్తాయి. ఈ అనారోగ్యం కూడా మనిషిని పీడిస్తుంది, దారిద్ర్యం కూడా మనిషిని పీడిస్తుంది. అంటే అలవాట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

మనకు వచ్చే తలంపులు మనకి సహకరించేటట్టుగా ఉండాలి. మనం ఎవరికైనా సహాయం చేశాం అనుకోండి, నేను వాడికి సహయం చేశాను అని రజోగుణం ఉన్నవాడు అనుకుంటాడు. సత్వగుణం ఉన్నవాడు ఏమనుకుంటాడు అంటే నేను సహాయం చెయ్యడానికి వాడు నాకు అవకాశం ఇచ్చాడు అనుకుంటాడు. అదీ తలంపే, ఇదీ తలంపే. సత్వ గుణం తలంపేమో నిన్ను బంధం నుండి విడదీస్తుంది. రజోగుణం తలంపేమో బంధంలోకి గెంటేస్తుంది. అంటే తలంపులు కూడా మనల్ని బంధిస్తాయి. తలంపుల విషయంలో మనం బహు జాగ్రత్తగా ఉండాలి. భగవంతుడు చెప్పిన ప్రతీ వాక్యం కూడా నిజం. మీరు ప్రకృతి మనుషుల మాటలు భుజాన వేసుకుని తిరగకండి. శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకోవాలి, భగవంతుడిని మనం ప్రమాణంగా తీసుకోవాలి. అయితే భగవంతుడు చెప్పిన మాటలు మనం చదివినా వాటిమీద హృదయపూర్వకంగా విశ్వాసం కుదరటం లేదు. దానికి కారణం మన మనస్సులో ఉన్న దోషాలు. భగవంతుడు చెప్పిన మాటల్లో దోషం లేదు. మన మనస్సులో ఉన్న దోషం వల్ల. భగవంతుడు చెప్పిన వాక్యం నిజం అయినప్పటికీ దానిని మనం గ్రహించలేక పోతున్నాం. అది గ్రహించే శక్తి రావడానికి ఇలా జన్మలు ఎత్తి మనం మొట్టికాయలు తింటూ ఉంటాం. ఇలా జన్మలు ఎత్తి మొట్టికాయలు తినగా, తినగా కర్మ అనుభవించగా, అనుభవించగా ఈ కర్మానుభవం పూర్తి అయ్యిన తరువాత ఎప్పుడో ఒక జన్మలో భగవంతుడు చెప్పిందే నిజం మనం కాలాన్ని చాలా వేస్ట్ చేసుకున్నాం అని వాడికి తెలుస్తుంది. మనకి కర్మ అనుభవం కలగడం కోసం, జీవితంలో కొన్ని అనుభవాలు కలగడం కోసం ఈ శరీరం వచ్చింది. ఈ

శరీరం ఏ అనుభవాలు అయితే పొందవలసి ఉందో, ఆ అనుభవాలు పొందేవరకు ఈ శవం భూమి మీద తిరుగుతూ ఉంటుంది.  ఆ అనుభవాలు పొందడం పూర్తి అయ్యిపోయిన తరువాత, తినవలసిన మొట్టికాయలు అన్నీ తిన్న తరువాత, అప్పుడు శరీరం మరణిస్తుంది.


రమణమహర్షి గారు ఏమంటున్నారు అంటే దేహం చనిపోతే మోక్షం వచ్చేస్తే ఏ గొడవా లేదు.  చనిపోవడానికి సాధన అక్కర్లేదు.  ఏదో ఒక రోజున చనిపోతాం.  ఈ దేహం లోంచి విడిపోవడం వలన మోక్షం ఎవడికీ రాదు.  ఎవడైతే ఈ దేహం నేను అని అంటున్నాడో, ఆ నేనుని ఎంక్వయిరీ చేసి, విచారణ చేసి, ఏ నేను అయితే నీకు దేహానికి పరిమితం చేస్తుందో, ఆ నేను లోంచి విడుదల పొందడం మోక్షం కానీ, దేహం నుంచి విడుదల పొందడానికి సాధన అక్కర్లేదు.  ఏదో ఒక రోజున అందరం చనిపోతాం, స్మశానంలో కాలిపోతాం.  అలా మోక్షం వచ్చేస్తే అందరికీ వచ్చేస్తుంది.  దేహం చనిపోతే మోక్షం ఎవరికీ రాదు.  దేహం చనిపోయిన తరువాత వాళ్ళు కొంతకాలం నిద్రలో ఉంటారు. నిద్రలో కొంతకాలం ఉన్నాక అప్పుడు పరమేశ్వరుడు ఏమి చేస్తాడు అంటే, వాడి వాసనానుసారంగా, వాడికి ఎటువంటి కోరికలు అయితే ఉన్నాయో, వాడికి ఎటువంటి వాసనలు అయితే ఉన్నాయో, ఆ వాసనలు బట్టి తీసుకెళ్ళి ఆ కుటుంబంలో పడేస్తాడు. కొంతమంది ఇటువంటి కుటుంబంలో పుట్టాం ఏమిటండి మేము అంటారు.  వాళ్ళకి తగ్గ కుటుంబం కాబట్టి ఈశ్వరుడు అక్కడ పడేశాడు.  వాళ్ళ తల్లితండ్రులను కూడా ఈశ్వరుడు సెలెక్ట్ చేస్తాడు.  అంటే మీకు ఏవిధమైన సంస్కారాలు ఉన్నాయో, ఆ సంస్కారాలు నేరవేరడానికి ఆ కుటుంబం బాగుంటుంది కాబట్టి అక్కడ పడేస్తాడు.

దేవుడికి ఒకళ్ళ మీద ఇష్టం లేదు, ఒకళ్ళ మీద అయిష్టం లేదు.  దేవుడికి రాగద్వేషాలు లేవు.  దేవుడి దాకా ఎందుకు, కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే, నీరు ఏ విధంగా అయితే తామరాకుని అంటదో, అలా మమకార రహితంగా, అహంభావ రహితంగా, ఆసక్తి రహితంగా ఎవరైతే పని చేస్తున్నారో, ఆ పని తాలూకు పుణ్య పాపాలు కూడా జీవుడిని అంటవు అని చెప్పాడు.  ఇక దేవుడిని ఎలా అంటుతాయి? ఆసక్తి రహితంగా పనిచేస్తూ ఉంటే, అహంభావ రహితంగా పని చేస్తూ ఉంటే జీవుడిని కూడా పుణ్య పాపాలు అంటవు.

ఇప్పుడు ఈ బల్ల ఉంది. బల్ల మీద ఉన్న వస్తువు బల్ల తీసేస్తే పుస్తకం ఎక్కడ పడుతుంది? కింద పడుతుంది. ఎందుచేత అంటే దానికి ఆశ్రయం లేదు. అలాగే ప్రపంచంలో ఉన్న మంచి గొడవలకి, చెడ్డ గొడవలకి, నీ దేహ సంస్కారాలకి, నీ జీవలక్షణాలకి అన్నిటికీ ఆశ్రయం ఏమిటంటే మనం చెప్పే నేను. అవి మంచిగుణాలు అవ్వనివ్వండి, చెడ్డగుణాలు అవ్వనివ్వండి, ఏ విషయం అయినప్పటికీ లోకవాసన అయినా, శాస్త్రవాసన అయినా, దేహవాసన అయినా వాసనలు అన్నీ కూడా దేనిని ఆశ్రయించి ఉన్నాయి? నేనుని ఆశ్రయించి ఉన్నాయి. అంటే ఇప్పుడు మనం ఏదైతే నేను నేను అంటున్నామో ఆ నేనుని ఆశ్రయించి ఉన్నాయి. ఆ నేను కనుక పడిపోతే ఈ నేనుని ఆశ్రయించినవి అన్నీ కూడా పడిపోతాయి.

ఆత్మ ఆత్మ అంటారు, బ్రహ్మం, బ్రహ్మం అంటారు, ఎవరు వారు? మనమే. మనం దేహం అనుకుంటున్నాము కాబట్టి బ్రహ్మం అంటే, ఆత్మ అంటే మనం ఎవరో అనుకుంటున్నాము. ఆత్మ మనకి అనుభవంలో లేదు కాబట్టి అది లేదు అనుకుంటున్నాము. దేహం, మనస్సు అనుభవంలో ఉన్నాయి కాబట్టి ఇవి ఉన్నాయి అనుకుంటున్నాము. మనకి అనుభవంలో ఉన్నవి ఉన్నాయి అనుకుంటున్నాము. అనుభవంలో లేనివి లేవు అనుకుంటున్నాము, అవి ఉన్నా లేవు అనుకుంటున్నాము. ఎందుచేత? నీకు అనుభవానికి అది చిక్కటం లేదు కాబట్టి. గాఢనిద్రలో మనం దేహం నుండి, మనస్సు నుండి, ఇంద్రియాల

**మనస్సు యొక్క చలనం మీద దృష్టి పెట్టవద్దు. మనస్సుకు ఆధారంగా ఉన్న ఆ మూలం మీద నీ దృష్టిని పెడితే, మనస్సు యొక్క చలనం ఆగిపోతుంది. మనస్సు యొక్క చలనం ఎప్పుడైతే ఆగిపోయిందో దాని మూలం నీకు తెలుస్తుంది. ఆ మూలం ఎప్పుడైతే నీకు తెలిసిందో నిజమైన నేను నీకు తెలుస్తుంది.**



నుండి, మనలను క్షోభపెట్టే విషయాల నుండి, ఈ అహంభావన నుండి మొత్తం అన్నిటినుండి విడిపోతున్నాము. గాఢనిద్రలో ఎవరికీ అహంకారం ఉండదు. ఎందుచేత అహంకారం ఉండదు? అది ఎక్కడ నుండి వచ్చిందో అక్కడ కలిసి పోయింది. అహంభావన రావడం వల్ల దేహం వచ్చింది, ఇంద్రియాలు వచ్చాయి, మనస్సు వచ్చింది, ప్రపంచం వచ్చింది, ఈశ్వరుడు వచ్చాడు. మనస్సు లేచిన వెంటనే మనస్సు కల్పించినవి అన్నీ వస్తాయి. మనస్సు అణిగిపోయిన వెంటనే మనస్సు కల్పించినవి కూడా అణిగిపోతాయి.

ఇప్పుడు జడ్జీగారు అడిగేది ఏమిటంటే, ఎంక్వయిరీ ఒక్కటే సరిపోతుందా? ఇన్వెస్టిగేషన్ ఒక్కటే సరిపోతుందా? మిగతా గొడవలు ఏమైనా అవసరమా అంటే క్రమశిక్షణ అవసరం. ఆహారనియమం ఉంది అనుకోండి ఆహారనియమం వల్లే జ్ఞానం వచ్చేయదు. అది శరీరాన్ని, మనస్సుని కండిషన్‌లో పెడుతుంది. మనస్సుకి మౌనాన్ని కూడా అలవాటు చెయ్యాలి. మనస్సుకి మౌనాన్ని అలవాటు చేస్తే అహంభావం తగ్గుతుంది. సర్వసాధారణంగా మాట అహంభావంలోంచే వస్తుంది. ఉదయం నుండి సాయంత్రం దాక మనం మాట్లాడే మాటలు అవసరం ఉండి మాట్లాడుతున్నామా, అవసరం లేకుండా మాట్లాడుతున్నామా అంటే అవసరం లేకుండా మాట్లాడే మాటలు అన్నీ అహంభావం వల్లే మాట్లాడుతున్నాము. అహంభావం వల్ల మాట్లాడే మాటలు అన్నీ అహంభావనని పెంచేస్తాయి. అందుచేత నువ్వు ఏమి చేస్తావు అంటే, ఇవి అబ్జర్వ్ చెయ్యి. ఆహారనియమం ఒకటి, మౌనం ఒకటి కూడా నువ్వు నేర్చుకోవాలి.

విచారణ ఒక్కటే సరిపోతుందా? మిగతా గొడవలు కూడా ఏమైనా కావాలా? అని అడుగుతున్నారు. ఇక్కడ గ్రహించవలసింది ఏమిటంటే మిగతా గొడవలు కూడా కావాలి. మిగతా గొడవల వల్ల జ్ఞానం వచ్చేస్తుంది అని కాదు. విచారణ వల్లే వస్తుంది జ్ఞానం. మిగతా విషయాలు విచారణకి సహాయపడతాయి. ఆహారనియమం వల్ల, మౌనం వల్ల, సహవాసం వల్ల, క్రమశిక్షణ కలుగుతుంది. క్రమశిక్షణ లేకపోతే ఏదీ మనం సాధించలేము. కొన్ని నియమాల వలన మనస్సుకి కుదురు కలుగుతుంది. ఆ కుదుట పడిన మనస్సు, శాంతి పడిన మనస్సు, శుద్ధి పడిన మనస్సు, నిర్మలమైన మనస్సు, అది విచారణ చెయ్యడానికి

ఫిట్ అవుతుంది. అంటే యోగ్యత సంపాదిస్తుంది. విచారణ వల్లే జ్ఞానం వస్తుందా అంటే, విచారణ వల్ల జ్ఞానం వస్తుంది. ఆ విచారణకి సహకారం చేసే విషయాలను మనం పోగేసుకోవాలి. అంటే మనకి క్రమశిక్షణ కావాలి.

నిజం అనేది ఏకంగా ఉంటుంది, శాంతంగా ఉంటుంది. పరిశుద్ధంగా ఉంటుంది. ఒక ఉపనిషత్తులో పరిశుద్ధమైన నీళ్ళు, పరిశుద్ధమైన నీటిలో పోస్తే ఎలా ఉంటుందో, ఈ పరిశుద్ధమైన మనస్సు ఆత్మలో కలిసినా అలాగే ఉంటుంది అని చెప్పారు. ఆత్మ ఎంత పరిశుద్ధమైనదో నీ మనస్సుని కూడా నువ్వు అంత పరిశుద్ధం చేసుకుంటే, నీ మనస్సు ఎప్పుడైతే పరిశుద్ధం అయ్యిందో, పవిత్రం అయ్యిందో, ఏకాగ్రం అయ్యిందో, నిదానం అయ్యిందో, కుదుటపడిందో, దానికి ఎప్పుడైతే శాంతి కలిగిందో, అప్పుడు పరిశుద్ధమైన దాంట్లో ఐక్యం అవుతుంది.

నిద్రలో మనం అహంభావన లేకుండా ఉన్నాము, అలాగని ఎప్పుడూ నిద్రపోతాం అంటే ఎలాగ? భగవాన్ చెప్పేది ఏమిటంటే గాఢనిద్రలో నీకు తెలియకుండానే అహంభావన వెళ్ళి సత్యవస్తువులో కలుస్తుంది. నువ్వు జాగ్రదావస్థలో ఏమి చెయ్యాలి అంటే, నువ్వు ఎరుకలో ఉండగానే విచారణ చేసి, నువ్వు ప్రయత్నం చేసి, సాధన చేసి, సత్యవస్తువులో ఐక్యం చెయ్యటమే యోగం యొక్క లక్ష్యం. నిద్రపోయే ముందు వెళ్ళి ఐక్యం అవ్వడానికి పెద్ద ప్రయత్నం లేదు. ప్రయత్నం అక్కర్లేకుండానే నిద్రలో వెళ్ళిపోతుంది. కానీ జాగ్రదావస్థలో నువ్వు అన్ని నియమాలు పాటిస్తూ, కంట్రోల్డ్‌గా ఉంటూ, అప్పుడు నువ్వు ఏమి చెయ్యాలి? గాఢనిద్రలో నీ మనస్సు వెళ్ళి ఎక్కడ అయితే ఐక్యం అవుతుందో, జాగ్రదావస్థలో నువ్వు ప్రయత్నం చేసి మనస్సుని అక్కడే ఐక్యం చెయ్యాలి. దానికి విచారణ అవసరం. మోక్షం పొందాలి అనేటటువంటి కాంక్ష లేకపోవడం వల్ల ఆ విచారణ మనం ఏ జన్మకి ఆ జన్మే అశ్రద్ధ చేస్తున్నాం. లోపల తపన ఉండాలి. దీనికి పెట్టుబడి ఏమిటంటే రూపాయలు కాదు. తెలుసుకోవాలనే కాంక్ష, అంటే మనం విషయాన్ని తెలుసుకోవాలి, బ్రహ్మానుభవం పొందాలి అనే కాంక్ష అదే పెట్టుబడి. ఏదైనా వ్యాపారం చెయ్యాలి అంటే రూపాయలు ఉండాలి. కానీ బ్రహ్మానుభవం సంపాదించడానికి రూపాయల తోటి పనిలేదు. ఇది

రూపాయలు చేసి పెట్టే పని కాదు.

భోగం ఎక్కడుంది? ధనం ఉంటే భోగం ఉంది. మనకు ఎదురుగా ఎన్ని భోగాలు ఉన్నప్పటికీ ధనం లేదనుకోండి, వీడికి అనుభవించడానికి అవకాశం లేదు. అలాగే లోకంలో ఎటువంటి గొడవలు ఉన్నప్పటికీ, ఇవి అన్నీ అహంభావనని ఆశ్రయించి ఉన్నాయి. ధనం లేని వాడికి భోగం లేదు, అహంభావన లేని వాడికి దుఃఖం లేదు. అది ఇక్కడ మీరు గ్రహించవలసినది. లోకంలో భోగాలు తొంభై ఉండవచ్చు కానీ ధనం లేనివాడికి భోగం లేదు కదా, అలాగే లోకం పరిస్థితి ఎలా ఉన్నా, లోకం పోకడ ఎలా ఉన్నా, నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నీకు ప్రతికూల పరిస్థితి వచ్చినా, అనుకూల పరిస్థితి వచ్చినా అహంభావన లేనివాడికి దుఃఖం లేదు. అంటే ప్రపంచంలో దుఃఖ కారణాలు తొంభై ఉండవచ్చు, కానీ అహంభావన లేని వాడికి దుఃఖం లేదు. అలాగే ప్రపంచంలో తొంభై రకాల భోగాలు ఉండవచ్చు, ధనం లేని వాడికి భోగం లేదు.

నువ్వు దేనినైతే పొందుదాము అనుకుంటున్నావో, నీ హృదయాంతరాళాల్లోంచి, హృదయం యొక్క లోతుల్లోంచి ఆ వస్తువు మీద నీకు ప్రేమ కలగాలి, ప్రీతి కలగాలి, ఇష్టం కలగాలి, అది పౌడర్ అంటించుకున్నట్టు ఉండకూడదు. అది హృదయం యొక్క లోయల్లోంచి రావాలి. ఏ వస్తువును అయితే నువ్వు పొందాలి అనుకుంటున్నావో ఆ వస్తువు యందు ప్రేమ లేకుండా, ప్రీతి లేకుండా, దానిని పొందలేవు. ఆహార నియమాల వల్లే దానిని నువ్వు పొందలేవు. కానీ దాని మీద ఇష్టం కలగడానికి, ప్రీతి కలగడం కోసం, ఇవి సహకరిస్తాయి. నీకు శరీరంలో అనారోగ్యం ఉంటే అస్తమాను శరీరమే జ్ఞాపకం వస్తుంది. నువ్వు మనస్సులో ఏదైనా చింత పెట్టుకుంటే మనస్సే ఎక్కువ జ్ఞాపకం వస్తుంది. ఇంక నీ హృదయంలో ఉన్న దేవుడిని నువ్వేమి ప్రేమిస్తావు? ఈ నియమాలు అన్నీ మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసారు.

ఇక్కడ పరమేశ్వరుడు చెప్పేది ఏమిటంటే, నువ్వు బాహ్యంగా సత్పురుషుల తోటి సహవాసం చెయ్యవచ్చు కానీ అదే లక్ష్యం కాదు. నీ గుహలో ఉన్నటువంటి ఆ సద్వస్తువుని తెలుసుకోవడానికి బాహ్య సత్పురుషుల నుండి నువ్వు సహకారం తీసుకోవాలి. కానీ అదే

గమ్యం కాదు. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు, నిర్మలవస్తువు, శాంతివస్తువు బ్రహ్మములో నిన్ను ఐక్యం చెయ్యటం కోసం బాహ్యామైన సత్పురుషులు నీకు సహాయం చేస్తారు. బాహ్యామైనటువంటి ఐశ్వర్యాల వల్ల నువ్వు ఆ వస్తువును పొందలేవు. బ్రహ్మము ఎవరికైతే ఎరుక పడాలి అని అనుకుంటుందో వారికి మాత్రమే అది ఎరుక పడుతుంది. ఈశ్వరుడిని హృదయపూర్వకంగా ఎవరైతే ప్రేమిస్తున్నారో వారికే ఈశ్వరుడు తెలియబడతాడు. ఆ ప్రేమ నిలకడగా ఉండాలి. ఉదయం ఒకలాగా, సాయంత్రం ఒకలాగా ఉండకూడదు. మనకి అన్నీ కావాలి, దేవుడు కావాలి. కానీ దేవుడు ఒక్కడే నాకు కావాలి అనుకునేవాడికి మాత్రమే దేవుడు తెలియబడతాడు. మనకి కూడా దేవుడు కావాలి, కానీ ఆ దేవుడు కావాలి అనే కాంక్ష ఎక్కడో మారుమూలకి గెంటేశాము. దానికంటే ప్రముఖ స్థానం వహించిన కోరికలు మనలో ఉన్నాయి. ఇవన్నీ ఈశ్వరుడు లోపల నుండే చూస్తూ ఉంటాడు. ఈశ్వరుడు కన్ను మనం మూయలేము. లోపల ఉండి వాడు వాచ్ చేసుకుంటూ వీడికి యోగ్యతా ఉంది, వీడికి మనల్ని పొందాలి అనే కాంక్ష తప్పించి మరో కాంక్ష లేదు అనుకున్నప్పుడు మాత్రమే పరమేశ్వరుడు మనకి ఎరుక పడతాడు.

మనం వెతికే వస్తువు, మనం తెలుసుకోవాల్సిన వస్తువు ఎక్కడ ఉంది? మన లోపలే ఉంది. ప్రయత్నం కొంత వరకే మనం చేయగలము. మనస్సు కొంతదూరం ప్రయత్నం చేసిన తరువాత, ప్రయత్నం తోటి పని లేకుండానే బ్రహ్మం వైపుకి ప్రయాణం చేస్తుంది. అభ్యాసం కనుక మనం చేస్తుంటే, మనకి తెలిసిన విషయాన్ని మనం కనుక ప్రాక్టీస్ చేస్తుంటే అలా ప్రాక్టీస్ చెయ్యగా, చెయ్యగా అది మనకి తేలిక అవుతుంది. అలా కొంతదూరం ప్రయత్నం చేసిన తరువాత మనస్సు యొక్క ప్రయత్నం తోటి సంబంధం లేకుండానే సత్యవస్తువు మనకి అనుభవంలోకి వస్తుంది. కొంతదూరమే మనస్సు ప్రయత్నం చెయ్యాలి. ఇక్కడ జడ్జీగారు ఏమంటున్నారు అంటే, విచారణ ఒక్కటే చాలా అని ఆయన అడిగేది. విచారణ ఒక్కటే చాలు, ఏదో ఒక మార్గం చాలు, బుద్ధిసూక్ష్మత ఉన్నవాళ్ళకి విచారణ సరిపోతుంది. బుద్ధిసూక్ష్మత లేనివాళ్ళు ప్రాణాయామం చెయ్యవచ్చు, జపధ్యానాలు ఇలా ఏదో కార్యక్రమాలు ఉంటాయి.

భగవంతుడిని తెలుసుకోవడానికి చేసే ప్రయత్నాల్లో కూడా కొంతమంది సిగ్గుపడుతూ

ఉంటారు. వీళ్ళు సిగ్గు పడుతున్నారు అని కూడా దేవుడు చూస్తూ ఉంటాడు. వాళ్ళు సొంత పనులు చేసుకునేటప్పుడు ఏమి సిగ్గుపడటం లేదు, మనల్ని తెలుసుకోవటానికి సిగ్గు పడుతున్నారు వీళ్ళకి మనం తెలియబడడం ఏమిటి అనుకుంటాడు. మీకు అర్థం అవుతోందా? ఈ మీటింగుకి రావడానికి మీరు సిగ్గు పడక్కర్లేదు. ఒకవేళ మీరు సిగ్గు పడుతూ ఈ మీటింగుకి కనుక వస్తే మీరు సిగ్గు పడుతూ వెళుతున్నారు అన్న సంగతి కూడా ఆయన గుర్తిస్తాడు. సిగ్గు వలన కూడా మనకి చదువు సరిగ్గా రాదు. కొంతమందికి తెలియకపోయినా సిగ్గు వల్ల తెలిసున్నట్టు నటిస్తారు, కొంతమంది ఆకలి ఉన్నప్పుడు కూడా భోజనం మళ్ళీ అడిగితే ఏమనుకుంటారో అని అడగరు. సిగ్గు వల్ల కూడా చాలామంది నష్టపోతారు. ఆధ్యాత్మికంగా అటు ఉంచండి, భౌతికంగా కూడా, ఏదైనా మనకి తెలియని విషయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేసేటప్పుడు సిగ్గు కూడా అడ్డు వస్తుంది. భగవదనుభవం పొందడానికి మనం సిగ్గు పడవలసిన అవసరం లేదు. మీరు ఏదైనా ఒక పాట పాడుకుంటూ ఉంటే, భగవంతుడికి సంబంధించిన ఒక మాట మాట్లాడుకుంటూ ఉంటే సిగ్గు పడవలసిన పని లేదు. వారు ఏమనుకుంటారో, వీరు ఏమనుకుంటారో అనే సమస్య నీకు అక్కర లేదు. అంటే ఏమిటి? వాళ్ళు ఏమనుకుంటారో, వీళ్ళు ఏమనుకుంటారో అనుకునేది అహంభావనే. భగవాన్ చెప్పేది ఏమిటంటే, బుద్ధిసూక్ష్మత ఉన్న వాళ్ళకి విచారణ సరిపోతుంది అని చెబుతున్నారు. మిగతావి అవసరం లేదా అంటే బుద్ధి సూక్ష్మతని పెంచడానికి అవసరమే. డైరెక్ట్‌గా వాటి అవసరం లేకపోయినా, indirectగా వాటి అవసరం ఉంది అంటున్నారు.

మోక్ష సామ్రాజ్య సిద్ధికి ఈశ్వరానుగ్రహం అవసరమా? సాధకుడు చేసే కృషి వల్లే మోక్షాన్ని పొందుతాడా? ఈశ్వరుడి యొక్క కృప కూడా అవసరమా? అని ప్రశ్న, అంటే ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి. కృషి, కృప. దేవుడు చూపించేది కృప, మనం చేసేది కృషి. కృషి వల్ల కృప కలుగుతుంది. ప్రతీదానికి దేవుడి కృప అవసరమే. భగవంతుడు ఎప్పుడైనా మనకి జ్ఞాపకం వస్తున్నాడు అంటే మన తెలివితేటల వల్ల రావడం లేదు. ఆయన అనుగ్రహం వల్లే మనకి జ్ఞాపకం వస్తున్నాడు. ఇంతకీ రమణమహర్షి గారు చెప్పేది ఏమిటంటే ఆయన అనుగ్రహం వల్లే ఆయనను పొందాలి అంటున్నాడు. దేవుడి కృప అవసరమా అని

అడుగుతున్నారు. అవసరం లేకపోవడం ఏమిటి, ఆయన అనుగ్రహం వల్లే మనం ఆయనని పొందాలి. ఆయన అనుగ్రహం వల్లే ఆయనను స్మరించుకుంటున్నాం. ఆయన అనుగ్రహం వల్లే అది మనకి కలుగుతుంది. మనకి ఎప్పుడైనా కృషి సాగుతుంటే ఆయన అనుగ్రహం వల్లే కృషి సాగుతుంది. భగవదనుభవం మనం పొందేవరకు, భగవంతుడిలో ఐక్యం అయ్యేవరకు, ఈ శరీరాలు చనిపోవటం, ఈ శరీరాలు పుట్టటం జరుగుతూనే ఉంటాయి. అంటే పాత శరీరాలు పోతూ ఉంటాయి, కొత్త శరీరాలు వస్తూ ఉంటాయి. ఆ శరీరాలు తయారు చేసినప్పుడే ఆ శరీరాల ద్వారా ఏ అనుభవాలు పొందాలో రాసి పెడతారు. జ్ఞానం సంపాదించే విషయం అశ్రద్ధ చేస్తారు కానీ, శరీరాన్ని మటుకు అందరూ జాగ్రత్తగా చూసుకుంటారు. ఈ శరీరం తల్లి కడుపులో తయారు అవుతుంది. ఈ శరీరం తల్లి కడుపులో తయారు అయినప్పుడు తల్లే చూస్తుంది. తల్లి గర్భం నుండి బయటకి వచ్చాక వాడి శరీరం వాడే జాగ్రత్తగా చూసుకుంటూ ఉంటాడు. దేహపోషణ తోటే వాడికి సరిపోతుంది. అంటే దేహమే సర్వస్వం అనుకుంటాడు. దేహబుద్ధి అంత బలీయంగా ఉంటుంది.

సంసారం అంటే మనుషులు కాదు, సంసారం అంటే మనస్సే. అంటే మనకి చనిపోయినప్పుడు శరీరాలు మారతాయి కానీ మనస్సు మారదు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. శరీరంలో ఉండగానే ఆ మనస్సుని సంస్కరించుకుని మనం బాగుపడాలి. శరీరం మరణించటం వల్ల సంసారం ఆగదు. మనుషులు కొత్త మనుషులు వస్తారు, కొత్త పరిసరాలు వస్తాయి. ఎవరి కారణంగా నీకు సంసారం వస్తుందో వాడు అణిగే వరకు శరీరం వస్తుంది, శరీరం వస్తే సంసారం వస్తుంది. సంసారం అంటే మీ భర్త, మీ పిల్లలు కాదు. సంసారం అంటే మీ మనస్సే. మనస్సు ఉన్నంతకాలం శరీరాలు మారుతూ ఉంటాయి. కుటుంబంలో ఉన్న సభ్యులు మారుతూ ఉంటారు. మనస్సు అణిగితేనే కానీ మీ సంసారం అణగదు, మనస్సు అణగాలి. ఈ గుణాలు అన్నిటికీ ఆశ్రయం ఏది? మనస్సు. ఈ గుణాలు అన్నిటికీ ఏ మనస్సు అయితే ఆశ్రయం ఇస్తోందో, ఆ మనస్సు నశిస్తే గుణాలు కూడా నశిస్తాయి.

విరామం లేకుండా కృషి చేస్తే, అంటే మనం ఏమి విరామం లేకుండా, నిరంతరం ఆ భగవదనుభవం పొందడం కోసమే, ఏదన్నా పుస్తకం చదివినా, ఎవరితో అయినా

మాట్లాడినా, కేవలం ఆ భగవదనుభవం పొందడం గురించి తప్పించి మిగతా గొడవలు లేకుండా, అక్కర్లేని విషయాలకి వెళ్ళకుండా, ఏదో టైముకి నాలుగు మెతుకులు తిని మన పనేదో మనం చూసుకుంటూ, మిగతా కాలం అంతా కూడా భగవంతుడిని తెలుసుకోవడానికి కృషి చేస్తుంటే సరిపోతుందా? ఆ కృషి వల్లే దేవుడు తెలుస్తాడు కదా, ఇక కృప తోటి అంత పనిలేదు కదా, మనం చేసిన కృషే కదా అంతా, మనం చేసిన కృషి వల్లే ఆయన తెలుస్తాడు కదా అని అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే, మనం భగవంతుడిని స్మరించినా, భగవంతుడిని తెలుసుకోవాలి అని సాధన చేస్తున్నా ఇదంతా కూడా ఆయన అనుగ్రహంలోకే వస్తుంది. అది అంతా ఆయన కృపే. మీ అనుగ్రహం నాకు లేదు అని ఒక భక్తుడు భగవాన్‌తో అంటే నా అనుగ్రహం నీకు లేకపోతే నువ్వు ఇక్కడకు ఎందుకు వచ్చావు అన్నారు. దాని అర్థం ఏమిటి అంటే నిన్ను తీసుకొచ్చింది కూడా అదే. ఇక్కడ మనం గ్రహించవలసిన విషయం ఏమిటి అంటే మనకి ఏదైనా మంచి జరిగితే దేవుడి అనుగ్రహం అనుకుంటాము. మంచి జరిగినప్పుడు దేవుడి అనుగ్రహం ఎంతుందో, చెడు జరిగినప్పుడు కూడా దేవుడి అనుగ్రహం అంతే ఉంది, ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మంచి, చెడు కూడా దేవుడి అనుగ్రహం అనుకో, అంటే ఆయన ఆజ్ఞానుసారమే ఇదంతా నడుస్తోంది. ఇదంతా ఈశ్వర సంకల్పం తోటే నడుస్తుంది. అది తెలుసుకుంటే సుఖ పడతాడు, తెలియకపోతే వాడు దుఃఖపడతాడు. అంటే మనం చెయ్యవలసిన కృషి ఏదో చేస్తాం. తరువాత నిర్ణయించ వలసినది ఈశ్వరుడే. అనుకునేది మన సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఈ సృష్టి అంతా ఈశ్వరసంకల్పం తోటే నడుస్తోంది అన్న సంగతి నీకు అర్థమైతే అది అర్థమైన మరుక్షణంలోనే నీకు దుఃఖం నశిస్తుంది అని చెప్పారు భగవాన్.

ఇంద్రియముల కంటే, దేహం కంటే దగ్గరగా మన హృదయంలో పరమేశ్వరుడు ఉన్నప్పటికీ, మన దేహం మీద, లోకం మీద మనకున్న మోహం వల్ల ఈశ్వరుడు మనకి దూరంగా ఉన్నాడు అని అనిపిస్తుంది. మనకి మన దేహం మీద ఉన్న మోహం వల్ల, మనకున్న అలవాట్ల మీద ఉన్న మోహం వల్ల, లోకవిషయాల మీద ఉన్న మోహం వల్ల, భోగాల మీద ఉన్న మోహం వల్ల వస్తువు ఉన్నా గుర్తించే శక్తి మనకి రావడం లేదు. అంటే

అర్హత, యోగ్యత మనకి రావడం లేదు. దానికి ఏమిటి కారణం? మోహమే కారణం. రోగ కారణం ఎప్పుడైతేపోయిందో అప్పుడు రోగం ఎలా నశిస్తుందో, ఈ మోహకారణం నశించినప్పుడు మోహం కూడా నశిస్తుంది. మోహకారణం కూడా దేహబుద్ధే. ఒకొక్కసారి మనకి ఎవరి మీద అయితే ఎక్కువ ప్రీతిగా ఉందో వాళ్ళే ఎక్కువ విమర్శిస్తారు. బాహ్య గురువు ఏమి చేస్తాడు అంటే నీ మనస్సు ఎవరి దగ్గరకు వెళ్లి కూర్చుంటుందో వాళ్ళ చేత తిట్టిస్తాడు. వాళ్ళ చేత తిట్టిస్తుంటే ఇదేంటి వీళ్ళ గురించి మనం బాధపడుతుంటే, 24 గంటలు వీళ్ళు మనలను తిట్టడం ఏమిటి, ఇంక వీళ్ళ కోసం మనం పాటుపడడం ఏమిటి అని మీకు అనిపిస్తుంది. అలా అనిపించి అప్పుడు మనసులో ఒకసారి రవ్వంత అయినా విచారణ ప్రారంభిస్తారు. లోపల గురువు ఏమి చేస్తాడు అంటే వీడు విచారణ ప్రారంభించాడురా బాబు, ఇంక వీడి జుట్టు నా చేతికి దొరుకుతుంది అని లోపల కనిపెట్టుకుని ఉంటాడు. అంటే జుట్టు వాడి చేతికి అందేవరకు లోపల గురువు చూస్తూ ఉంటాడు. ఈ బయట గురువు ఏమి చేస్తాడు అంటే లోపల గురువుకి జుట్టు అందిస్తాడు. లోపల గురువు ఏమి చేస్తాడు అంటే జుట్టు వాడికి అందిన తరువాత వీడిని హృదయంలోకి లాగేస్తాడు. ఒకొక్కసారి మనం ఎవరికోసం అయితే జీవితం పొడవునా కష్టపడ్డామో వాళ్ళే తిడుతూ ఉంటారు. ఏమిటి వీళ్ళు ఇలా తిడుతున్నారు, వీళ్ళకి ఏమి కామన్‌సెన్స్ లేదా అనుకోకూడదు. ఈశ్వరుడు వాళ్ళని గిల్లుతూ ఉంటే వాళ్ళేమి చేస్తారు పాపం. ఈశ్వరుడు అస్తమాను వాడిని కదుపుతూ ఉంటే ఏదో ఒకటి తిడుతూ ఉంటాడు. ఒకొక్కసారి మంచివాళ్ళ నోటి వెంట కూడా చెడ్డమాటలు వస్తాయి. ఏమిటి వీళ్ళు చాలా మంచివాళ్ళు ఇలా మాట్లాడుతున్నారు ఏమిటి అని అనిపిస్తుంది మనకి మాములుగా, ఒకొక్కసారి ప్రమాదమైన



**మీ జీర్ణ శక్తిని బట్టి మీరు తినాలి. టైముకి తిని మీ మనసును దేవుడి మీద పెట్టుకోండి. అన్నం మానేసి అన్నాన్ని స్మరించడం కంటే అన్నం తిని దేవుడిని స్మరించండి.**

మాటలు వారి నోటి వెంట కూడా వస్తాయి. అది ఎవరు చేయిస్తున్నారు? ఈశ్వరుడి కార్యమే. మనం అది గ్రహించాలి.

జడ్జీగారు అడిగేది ఏమిటంటే, నా తెలివి తేటల వల్ల, నా విచారణ వల్ల, నా కృషి వల్ల, నా సాధన వల్ల దేవుడు తెలుస్తాడు కదా, ఇక దేవుడి కృప ఎందుకు అని, చాలామంది అలాగే అనుకొంటారు. వాళ్ళు అనుకున్నవి అన్నీ కలిసివస్తే ఇక దేవుడు లేడు, ఏమి లేదు అంతా మన తెలివితేటల వల్ల సాధిస్తున్నాం అనుకుంటారు. వాళ్లకి ఏదైనా ఆశాభంగం కలిగితే మటుకు మనకన్నా హయ్యర్ పవర్ ఏదో ఉంది అనుకుంటారు. మీకు అర్థం అవుతుందా? వాళ్ళు అనుకున్న కోరికలు అన్నీ నేరవేరిపోతున్నాయి అనుకోండి, నేరవేరిపోతే ఏమవుతుంది అంటే ఇదంతా మన తెలివితేటల వల్ల జరిగిపోతోంది అనుకుంటాడు. ఏదైనా ఆటంకం వస్తే మటుకు ఎంత ప్రయత్నం చేసినా ఈ పని జరగడం లేదు, హయ్యర్ పవర్ ఉందని అప్పుడు ఆలోచిస్తాడు వాడు. ఈ కోరికలు కూడా ప్రమాదమే. అంటే కోరిక నెరవేరితే గర్వం వస్తుంది, నెరవేరకపోతే దుఃఖం వస్తుంది. అదైనా తంటే , ఇదైనా తంటే!

అందరికీ మంచిగానే ఉండాలని ఉంటుంది, కానీ పొరపాట్లు అందరూ చేస్తూనే ఉంటారు. దీనికి కారణం ఏమిటి అంటే కోరిక అని పరమాత్మ చెప్పారు. కోరిక వల్లే మనిషి పొరపాటు చేస్తాడు. వాడు మంచిగా ఉందాం అనుకున్నా, కోరిక వల్లే వాడు పొరపాటు చేస్తూ ఉంటాడు. మనకి ఏదైనా కోరిక వచ్చింది అనుకోండి, దానిని సంతృప్తి పరచడానికి ప్రయత్నం చేస్తుంటాం. వచ్చిన కోరికనల్లా సంతృప్తి పరచుకుంటూ ప్రతీ జన్మలో మనం ప్రయాణం చేస్తుంటే నిప్పు మీద పెట్రోల్ వేశాం అనుకోండి అది పెరుగుతూ ఉంటుంది. అదే విధంగా నీకు వచ్చిన కోరిక నల్లా నేరవేర్చుకుంటూ వెళుతుంటే ఆ కాంక్ష పెరుగుతూ ఉంటుంది కానీ ఇంక తగ్గదు. నువ్వు కోరికని satisfy చెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నంతకాలం మంట పెరుగుతూనే ఉంటుంది. అంటే ఒక నెరవేరిన కోరిక వెళ్లి ఇంకొక పది కోరికలని తీసుకొస్తుంది.

అన్నవస్త్రాలు లేవు అనుకోండి. మనకి పెద్ద పెద్ద ఆస్తులు ఎందుకు ఏవో అన్నవస్త్రాలు ఉంటే చాలు, ఏదో నీడ ఉంటే చాలు అనుకుంటాము. అన్నం వచ్చాక, వస్త్రం వచ్చాక,

నీడ వచ్చాక మనసు ఆగుతుందా? మనస్సు ఆగదు. అప్పుడు మంత్రి పదవి కావాలి అంటుంది. అన్నవస్త్రాలు లేనప్పుడేమో పెద్ద పెద్ద గొడవలు మాకెందుకులెండి పొట్ట వెళ్ళిపోతే చాలు అనుకుంటాడు. ఆ అన్నవస్త్రాలు వచ్చాక వీడికే మళ్లీ మంత్రి అవ్వాలని ఉంటుంది. భగవంతుడు చెప్పేది ఏమిటంటే కోరికలని నువ్వు నెరవేర్చుకుంటూ వెళితే కోరికలని జయించలేవు. కోరికని satisfy చెయ్యడం కాదు, కోరికని కంట్రోల్ చెయ్యడం ప్రారంభించు. వాటిని నిగ్రహించుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. నిగ్రహించుకుంటుంటే కోరిక అణుగుతుంది. దానిని సంతృప్తి పరుస్తూ ఉంటే అది పెరిగిపోతుంది.

ఇక్కడ భగవాన్ ఒక మాట చెప్పారు. ఏదో ఒక కోరిక వచ్చింది అనుకోండి, సినిమాకి వెళ్లాలని కోరిక వచ్చింది అనుకోండి ఉదాహరణకి, ఆ సినిమాకి వెళ్లి చూసి వచ్చేశాం అనుకోండి, అది అక్కడితోటి ఆగదు. మళ్ళీ రేపు కూడా వెళ్ళాలి అనిపిస్తుంది. నువ్వు ఆ కోరికని నిగ్రహించుకుని, భగవంతుడిని స్మరించుకుని, ఏ భగవద్గీతలోనో శ్లోకం చదువుకుని, భగవంతుడిని ప్రీతిగా తలపెట్టుకుని ఆ కోరికని కొంచెం అదుపు చేసుకున్నావు అనుకో, ఆ అదుపు చేసుకున్న కోరిక నీకు శాంతిని తీసుకొస్తుంది, నెరవేరబడిన కోరిక అశాంతిని తీసుకొస్తుంది. ఒక్కసారే కదా సినిమా చూడటం అనుకుంటాం అనుకోండి. చూసి వచ్చేస్తాం అనుకోండి మరుసటి రోజున మళ్ళీ తీసుకుపోతుంది మనస్సు. ఎందుచేత అంటే దానికి అలవాట్లు. మనస్సు అలా చేసేస్తుంది అన్నమాట. అంటే మనం ఏది అనుభవించినప్పటికీ మనస్సు repetition కోరుతూ ఉంటుంది. ఈ రోజున మనం కాఫీ తాగాం అనుకోండి, మళ్ళీ రేపు అదే టైముకి కాఫీ తాగాలి అనిపిస్తుంది. మనస్సులో ముద్రలు పడిపోతాయి. Repetition కోరుతుంది. అందుచేత నువ్వు దానిని satisfy చేసుకుంటూ వెళుతుంటే అది పెరుగుతూ ఉంటుంది. దానిని satisfy చెయ్యకుండా కంట్రోల్ చేసుకుంటూ ఉంటే తగ్గుతుంది. ఆ వాంఛ కంట్రోల్ చేస్తుంటే తగ్గుతుంది, Satisfy చేస్తుంటే పెరుగుతుంది.

ఇంతకీ జడ్జీగారి తోటి భగవాన్ ఏమంటున్నారు అంటే, మిమ్మల్ని ఏమి బలవంతం చెయ్యను, మిమ్మల్ని బలవంతం పెట్టవలసిన అవసరం నాకు లేదు. అది మీరు satisfy

చేసుకున్నా మీ చేతిలోనే ఉంది, కంట్రోల్ చేసుకున్నా మీ చేతిలోనే ఉంది. మీరు satisfy చేసుకుంటూ పోతే బంధింపపడతారు, కంట్రోల్ చేసుకుంటూ వస్తే మోక్షానికి వెళతారు. ఇవి రెండు మీ ఎదురుగానే ఉన్నాయి. మీకు నచ్చింది మీరు చేసుకోండి. మీకు నేను చెప్పేది ఏముంది అంటున్నారు భగవాన్. నువ్వు ఎలా ప్రయాణం చెయ్యాలి అనుకుంటున్నావో అలా ప్రయాణం చెయ్యి. బలవంతం చెయ్యవలసిన అవసరం ఇక్కడ ఏమిలేదు. భగవాన్ మామూలుగా సూచన చేస్తారు. బలవంతం చేసే అలవాటు ఆయనకి అసలు లేదు. ఆత్మానుభవం కోసం నీకున్న పరిసరాలు, నీకున్న అంగబలం, నీకున్న అర్థబలం, నీకున్న సాధనాబలం ఎన్ని ఉన్నప్పటికీ నీకు మంచి మంచి టీచర్స్ ఉన్నప్పటికీ, నీకున్న వాతావరణం మంచిది అయినప్పటికీ, అన్నీ నీకు అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, నువ్వు సాధన బాగా చేస్తున్నప్పటికీ, ఈశ్వరానుగ్రహం అవసరమే అంటున్నారు ఇక్కడ భగవాన్. దేవుడు కలుగజేసుకోకుండా, దేవుడు interference లేకుండా, చివరి మెట్లో దేవుడు మనకి తెలియబడడు. ఏ వస్తువు కోసం మనం తంటాలు పడుతున్నామో ఆ వస్తువు యొక్క అనుగ్రహం లేకుండా దానిని పొందలేము. ఈశ్వరానుగ్రహం అవసరమే! చివరికి భగవాన్ చెప్పేది ఏమిటంటే, దేవుడు నీకు స్మరణలోకి వచ్చినా ఆయన అనుగ్రహం వల్లే ఆయన నీకు స్మరణలోకి వస్తున్నాడు అని చెబుతున్నారు. ఎక్కడో మోక్షం దాకా ఎందుకు? ఎప్పుడైనా భగవంతుడిని నువ్వు తలపెట్టుకున్నా ఆయన నిన్ను అనుగ్రహించడం వల్లే ఆయన నీకు తలంపులోకి వస్తున్నాడు కానీ నీ తెలివితేటల వల్ల రావడం లేదు. అంతా కూడా ఈశ్వరానుగ్రహమే.

మీకు పది రూపాయలు లాభం వచ్చింది అనుకోండి. అప్పుడు మీరు ఏమనుకోవాలి? దేవుడు ఇచ్చాడు అనుకోవాలి. పది రూపాయలు పోయింది అనుకోండి దేవుడే పట్టుకుపోయాడు అనుకోవాలి. అలా అనుకుంటూ ఉంటే మీ మనస్సు కుదురుగా ఉంటుంది. కర్త ఆయనే. కృష్ణుడు repeatedగా ఏమని చెప్పాడు అంటే, నీ చేతిలో ఉన్న పని ఏదో నువ్వు చేసేయ్. అది మటుకు హృదయ పూర్వకంగా చెయ్యి. Dedicatedగా చెయ్యి. Devotedగా చెయ్యి. నా చేతిలో ఉన్న పని గొడవ నీకు వద్దు. నువ్వు చేసే పని

మటుకు హృదయపూర్వకంగా చెయ్యి.  నా చేతిలో పని నేను చూసుకుంటాను.  కాని నువ్వు ఏమి చేస్తున్నావు అంటే నువ్వు చెయ్యవలసిన పని మానేసి నేను చెయ్యవలసిన పని నాకు అస్తమాను జ్ఞాపకం చేస్తున్నావు.  నువ్వు నాకేం reminder ఇవ్వక్కర్లేదు, application ఇవ్వక్కర్లేదు.  మీకు అర్థం అవుతోందా? నేను ఎప్పుడు చెయ్యాలో, ఎక్కడ చెయ్యాలో, ఎలా చెయ్యాలో, ఎప్పుడు చేస్తే నీకు అది ఉపయోగపడుతుందో, అది నేను చేస్తాను.  అంతేకానీ నా చేతిలో ఉన్న పని గొడవ నీకు అనవసరం.  నీ చేతిలో ఉన్న పని గొడవ ఏదో నువ్వు చూసుకో అని కృష్ణుడు ఎన్నిసార్లు చెప్పినా మన బుర్రకి ఎక్కడం లేదు.  ఎప్పుడైతే కృష్ణుడు చెప్పినట్టు మనం నడుచుకున్నామో మనకి ఆసక్తి నశిస్తుంది.  ఆయన చేస్తాడు, చెయ్యడు అనేది వేరే విషయం.  అదంతా అయన ఇష్టం.  అదంతా ఆయన చూసుకుంటాడు.  కానీ మన చేతిలో ఉన్న పని మటుకు హృదయపూర్వకంగా, నిండు మనసు తోటి మనం చెయ్యాలి. మిగతాది అంతా ఆయన చూసుకుంటాడు.  చేసినా ఆయన అనుగ్రహమే, చెయ్యకపోయినా ఆయన అనుగ్రహమే.  అదీ అనుగ్రహమే, ఇదీ అనుగ్రహమే.

భగవాన్ దగ్గర ఎవరైనా భక్తులు శరణాగతి గురించి మాట్లాడుతూ, అది అలా అనుకున్నాం, ఇది ఇలా అనుకున్నాం, ఇదీ జరగలేదండి, అదీ జరగలేదు మేము భక్తులమేనండి, దేవుడిని కోరాం అండి జరగలేదు అంటే, ఇదంతా శరణాగతి పొందిన వాళ్ళు అడిగే ప్రశ్నలేనా అనేవారు భగవాన్.  శరణాగతి పొందినవాడు భగవంతుడి సంకల్పానికి విడిచి పెట్టేస్తాడు.  వాడి చేతిలో పనేదో చేస్తాడు కానీ ఈశ్వరుడి సంకల్పానికి విడిచి పెట్టేస్తాడు.  చేశాడు, చెయ్యలేదు అనేవాడు శరణాగతి పొందినవాడిలో ఉండడు. ఈ పాయింట్ మీరు అర్థం చేసుకుంటే మీ మనస్సు చల్లబడుతుంది.

రమణమహర్షి గారికి cancer వచ్చింది.  డాక్టర్లు అందరూ ఆయన శరీరాన్ని నిలబెట్టడానికి కృషి చేశారు.  మేము వైద్యశాస్త్రంలో ఉన్న పనులన్నీ చేసేసాం.  ఇంక ఇది వైద్యానికి తగ్గదు.  మీరు ఏమి చెయ్యాలి అంటే ఈ cancer తగ్గిపోవాలి అని అనుకోండి, మీరు అనుకుంటే తగ్గిపోతుంది.  మా వైద్యం వల్ల తగ్గేలా లేదు ఇది అని డాక్టర్లు చెప్పారు. అప్పుడు భగవాన్ ఏమని చెప్పారు అంటే నాకు ఒక శరీరం ఉంది, ఆ శరీరానికి రోగం

ఉంది, ఆ రోగం తగ్గిపోవాలి అని అనుకునే వాడు లోపల ఉంటే, మీరు సలహాలు చెప్పకపోయినా అనుకుంటాడు. అలా అనుకునేవాడు ఏనాడో చనిపోయాడు. అనుకునేవాడు ఇక్కడ ఉంటే మీరు సలహా చెప్పకపోయినా అనుకుంటాడు. అనుకునేవాడు ఇక్కడ లేకపోతే మీరు సలహా చెప్పినా అనుకోడు. రోగం తగ్గిపోవాలి అనుకునేవాడు ఇక్కడ లేడు. వాడు ఎప్పుడో చనిపోయాడు అన్నారు భగవాన్, అది శరణాగతి అంటే.

ఇది ఇలా జరగాలి, అది అలా జరగాలి అనుకునేవాడిని ఈశ్వరుడికి ఇచ్చేయాలి. ఇచ్చేస్తే వీడు చల్లబడతాడు. చల్లబడుతుంటే జరగవలసింది ఏదో ఆయన ద్వారా జరుగుతూ ఉంటుంది. అంతా ఈశ్వరసంకల్పమే కదా జరగవలసింది ఏదో జరుగుతూ ఉంటుంది. భగవాన్ అనేవారు ఆశ్రమం పెట్టకముందు ఆకలి బాధ, ఇప్పుడు అజీర్తి బాధ, అంటే దేహం యొక్క ప్రారబ్ధం ఎలా ఉంటే అలా నడిచి వెళ్ళిపోతూ ఉంటుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచి పెట్టేయండి. భగవదనుభవం పొందడం కోసం మీరు చెయ్యవలసిన కృషి మటుకు త్రికరణశుద్ధిగా చేస్తూ ఉండండి. సోమరితనానికి అలవాటు పడకండి, కాలాన్ని పాడు చేసుకోకండి. ఆ జీవుడు ఏ అనుభవం అయితే పొందాలో, ఆ అనుభవం పొందిన తరువాత ఇంక జీవుడిని ఆ శరీరంలో ఉంచడు. సెపరేట్ చేసేస్తాడు. ఒక్క నిమిషం కూడా ఆగడు పరమేశ్వరుడు.

నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుడు, నీ హృదయంలో ఉన్న కంట్రోలర్, నీ హృదయంలో ఉన్న మరణం లేని వస్తువు, నీకు ఎప్పుడైతే అనుభవంలోకి వచ్చిందో, నీ హృదయంలో ఉన్న నిజం నీకు ఎప్పుడైతే అనుభవంలోకి వచ్చిందో, అప్పుడు పూర్వజన్మలు లేవు, పరజన్మలు లేవు, పుణ్యాలు లేవు, పాపాలు లేవు, ఇవన్నీ లేవన్న సంగతి, లోకం లేదు, ఏమీ లేదన్న సంగతి తెలుస్తుంది. నీ హృదయంలో ఉన్న తత్త్వం నీకు అనుభవంలోకి వచ్చేవరకు లేనిది ఉన్నదానివలె కనిపిస్తుంది. పూర్వజన్మలు కానీ, రాబోయే జన్మలు కానీ, కేవలం స్వప్నాలు మాత్రమే అన్న సంగతి నీకు తత్త్వం తెలిశాక తెలుస్తుంది అన్నారు. మాములుగా వ్యవహారికంగా పూర్వ జన్మలు ఉన్నమాట నిజమే ఈ హాలులో మనం కూర్చున్నట్టు, ఇలా రాబోయే జన్మలు కూడా వస్తాయి. అజ్ఞానికి భగవంతుడు ఉన్నచోటు కనపడదు. జ్ఞానికి భగవంతుడు లేని చోటు కనపడదు. ఉన్నది అదే వస్తువు. నీ దేహం నీకు ఇప్పుడు ఏ విధంగా అయితే నేనుగా వ్యక్తం

అవుతోందో అలాగ బ్రహ్మం నీకు నేనుగా వ్యక్తం అవుతుంది. ఆ పరమసత్యం, బ్రహ్మం ఎప్పుడైతే నీకు నేనుగా వ్యక్తం అయ్యిందో, ఇవన్నీ సున్నా అన్న సంగతి నీకు తెలుస్తుంది. నేను బంధింప పడిపోయాను, నేను బాధల్లో ఉన్నాను అని ఇప్పుడు నువ్వు అనుకుంటావు. తత్త్వం నీకు అనుభవంలోకి వచ్చాక అనవసరంగా, తెలియకుండా ఎంత బాధ పడ్డాను, ఎంత దుఃఖ పడ్డాను అన్న సంగతి తెలిసి నిన్ను చూసి నీకే ఆశ్చర్యం కలుగుతుంది అంటున్నాడు పరమేశ్వరుడు. మీకు ఏదైనా దుఃఖం కలగవచ్చు, మీకు ఏదైనా బాధలు కలగవచ్చు. కానీ మీకు తత్త్వం తెలిశాక మీరు పడ్డ బాధలు, మీకు వచ్చిన దుఃఖం అంతా కూడా స్వప్నం మాత్రమే అన్న సంగతి మీకు అనుభవంలోకి వస్తుంది.

దేవుడి అనుగ్రహం మన అందరి మీద ఉంది. శ్రద్ధ ఉన్నవాడికి అది ఉందని తెలుస్తుంది, శ్రద్ధ లేనివాడికి ఉందన్న విషయం తెలియదు. ఇదే గమ్మత్తు అంతేకానీ శ్రద్ధ లేనివాడికి కూడా అనుగ్రహం ఉంటుంది. కానీ ఉందన్న సంగతి వాడికి తెలియదు. శ్రద్ధ ఉన్నవాడికి తెలుస్తూ ఉంటుంది. కృష్ణుడు గీతలో ఏమన్నాడు అంటే, నీకు జ్ఞానం కావాలి అంటే, నిర్వాణస్థితి నువ్వు పొందాలి అంటే, మోక్షశాంతిని నువ్వు పొందాలి అంటే శ్రద్ధ అనే రెండక్షరాలని మర్చిపోకు అన్నారు. శ్రద్ధావాన్‌లభతే జ్ఞానం, నీకు శ్రద్ధ వల్లే జ్ఞానం కలుగుతుంది అన్నారు. అశ్రద్ధ పనికిరాదు అన్నారు.

రమణమహర్షి గారు ఏమని చెబుతున్నారు అంటే స్వతంత్రమైన శాంతి, స్వతంత్రమైన సుఖం, స్వతంత్రమైన ఆనందం నీ హృదయం లోంచి రావాలి. దానికోసమే నువ్వు ప్రయత్నం చెయ్యాలి. మనం సుఖం కోసం, శాంతి కోసం, ఆనందం కోసం, బాహ్యామైన వస్తువుల మీద కానీ, బాహ్యామైన వ్యక్తుల మీద కానీ, బాహ్యామైన పరిస్థితుల మీద కానీ ఆధారపడితే ఈనాటికైనా, ముందు నాటికైనా, ఈ జన్మలోనైనా, ముందు జన్మలోనైనా ఆశాభంగం తప్పదు అంటున్నారు. మనం బాహ్యామైన వ్యక్తులతో ఎవరితో అయినా స్నేహంగా ఉంటున్నాం అనుకోండి, ఆ స్నేహం బట్టి మనకి కొంచెం శాంతి వస్తుంది అనుకోండి, మళ్ళీ వాళ్ళు విరోధులు అయ్యిపోయారు అనుకోండి మనకి శాంతి అంతా పోతుంది. ఇవి నిలబడే టికెట్లు కాదు అంటున్నారు రమణమహర్షి.

Aim high and aim at the highest. నీ గమ్యం అంతా, నీ చూపు అంతా, నీ ప్రయత్నం అంతా పరమసత్యానికే గురిపెట్టి ఉంచు. అంతిమ సత్యానికే గురి పెట్టి ఉంచు. ఇవన్నీ మధ్యలో వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. నీ గోల్ ఏమిటో నువ్వు కరెక్ట్‌గా పెట్టుకో, ఆ గోల్ కోసం నువ్వు ప్రయత్నం చెయ్యి. ఒకవేళ నీ దేహప్రారబ్ధాన్ని బట్టి పదవి వస్తే చెయ్యి. అధికారం ఎంజాయ్ చేసే యోగం నీ దేహప్రారబ్ధంలో ఉంది అనుకో వస్తుంది, ఆ ప్రారబ్ధం అవ్వగానే పోతుంది. బాహ్యంగా నీ దేహప్రారబ్ధానికి డబ్బు రావలసి ఉంటే వస్తుంది, అధికారం రావలసి ఉంటే వస్తుంది. వాటి మీద మటుకి నీ ఆనందం నిలబెట్టుకోవద్దు. నీ సంతోషం కోసం వాటి మీద నువ్వు ఆధారపడి ఉంటే, అది పోయిన వెంటనే అంత దుఃఖం నిన్ను తరుముకుంటూ వస్తుంది. ఎవడైతే హృదయపూర్వకంగా కృషి చేస్తున్నాడో అటువంటి యోగికి, ఈశ్వరానుగ్రహం సహాయంతో వస్తువు లభ్యం అవుతుంది. అంటే ఆయన చెప్పేది ఇక్కడ ఫైనల్ జడ్జిమెంట్‌లో కలిపేసారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఆ జడ్జిగారు చెప్పింది గాలికి వదిలెయ్యలేదు. అంటే మీరు చెప్పినట్టు విరామం లేకుండా, విశ్రాంతి లేకుండా కొంచెం స్లోగా అయినా స్టడీగా మీరు కనుక పనిచేస్తూ ఉంటే, అలా పనిచేస్తున్న యోగికి, ఇప్పటివరకు జడ్జీగారు మాటలు చెప్పారు భగవాన్, ఆఖరున ఈయన మాట కూడా కలుపుకుని, అటువంటి కష్టపడి పనిచేసే సాధకుడికి ఈశ్వరానుగ్రహం సహాయంతో వస్తువు తెలియబడుతుంది అన్నారు. అంటే ఏమిటి? ఇక్కడ ఆయన చెప్పినదానిని ఒప్పుకున్నారు. కానీ నేను చెప్పిన విషయం కూడా కంపల్సరీగా అక్కడ ఉండవలసిందే. మీరు చెప్పిన పద్ధతిలో ఎవడైతే కృషి చేస్తున్నాడో, వాడికి ఈశ్వరానుగ్రహం యొక్క సహాయం తోటి, వాడి చేత వస్తువు పొందబడుతుంది అన్నారు.

మోక్షం కావాలి అని ఎవరైనా అడిగితే వచ్చిన దారినే వెళ్ళిపొండి అనేవారు భగవాన్. అంటే ఆయన ఉద్దేశ్యం ఏమిటంటే, హృదయం లోంచి నేను అనే తలంపు వచ్చింది. ఆ నేను అనే తలంపు వచ్చాక మనస్సు వచ్చింది. మనస్సు వచ్చాక దేహం వస్తుంది, దేహం వచ్చాక ప్రపంచం వస్తుంది. హృదయం లేకపోతే, సత్య వస్తువు లేకపోతే నేను అనే తలంపు లేదు. నేను అనే తలంపు లేకపోతే మనస్సు లేదు. మనస్సు లేకపోతే దేహం

లేదు, దేహం లేకపోతే ప్రపంచం లేదు. అందుచేత భగవాన్ ఏమనేవారు అంటే నువ్వు వచ్చిన దారినే వెళ్ళిపో, అంటే నువ్వు ఎక్కడ నుంచి వచ్చావో అక్కడికే వెళ్ళిపో, భౌతికంగా కూడా మీరు వచ్చిన దారిన వెళ్ళిపోతే ఎక్కడకి వెళతారు? ఇంటికి వెళ్ళిపోతారు. అదే విధంగా ఆధ్యాత్మికంగా కూడా మీరు వచ్చిన దారినే వెనక్కి వెళ్ళిపోతే మీ హృదయ గుహలోకి వెళ్ళిపోతారు. అంటే దేవుడు ఎక్కడ ఉన్నాడో అక్కడకి వెళ్ళిపోతారు. దేవుడు ఎంత శాంతి అనుభవిస్తున్నాడో, ఎంత సుఖం అనుభవిస్తున్నాడో, ఆ దేవుడు పొందే శాంతి, దేవుడు పొందే సుఖం, దేవుడు పొందే ఆనందం అంతా నీకు ఇచ్చేస్తాడు.

జడ్జీగారు తోటి భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే, మీరు చిన్న చిన్న విషయాల మీద, పొట్టి పొట్టి విషయాల మీద, అప్రధానమైన విషయాల మీద మీ మనస్సు పెట్టకండి. వారు తిట్టారు, వీరు కొట్టారు, వారు ఇలా అన్నారు, వారు అలా అన్నారు, వాళ్ళు మమ్మల్ని అగౌరవ పరిచారు, వీరు గౌరవ పరిచారు, వారు ఇంటికి వెళితే మాట్లాడలేదు, వారిని చూసినా మాట్లాడలేదు, ఈ చిన్న చిన్నగొడవల మీద, స్వల్పమైన విషయాల మీద, అల్పమైన విషయాల మీద మీ మనస్సుని పెట్టకండి. కాలాన్ని పాడు చేసుకోకండి, మీ లోపల మనస్సుకి ఉన్న శక్తిని పాడు చేసుకోకండి. మీరు కష్టపడుతున్నారు పాపం, మీరు శ్రమ చేస్తున్నారు, విరామం లేకుండా కృషి చేస్తున్నారు, ఇవాళ ఉండి రేపు పోయేది కాదు మీరు సాధించేది. ఈ గౌరవాలు, అగౌరవాలు కేవలం స్వప్న సమానం. ఈ దారిద్ర్యం, ధనం కూడా స్వప్నం తోటి సమానమే. పాండిత్యం, పాండిత్యం లేకపోవడం కూడా స్వప్నం తోటి సమానమే. ఇవన్నీ మనసుకి సంబంధించినవి, ఇటువంటి చిన్న చిన్న గొడవల మీదకి,



**సాధువు అంటే ఎర్ర బట్టలు కట్టుకున్నవాడు సాధువు కాదు. ఎవడికైతే క్షమించే స్వభావం ఉందో వాడే సాధువు.**

అల్పమైన గొడవల మీదకి, మీ మనస్సుని పోనివ్వకండి. ఆత్మ కంటే తక్కువ విషయముల తోటి మనకేమి పని. ఏదైతే ఎప్పుడూ ఉందో దానిని సంపాదించండి, దాన్ని తెలుసుకోండి. భగవాన్ దగ్గర ఒక గుణం ఉంది. చైతన్యం తప్పించి, అంతిమ సత్యం తప్పించి, పరబ్రహ్మం తప్పించి ఏ విషయం గురించి మీరు మాట్లాడినా, ఆ విషయాల గురించి మిమ్మల్ని ఎవరు ఆలోచించమన్నారు? మిమ్మల్ని ఎవరు చెప్పమన్నారు అని అడిగేవారు. దేనిని తెలుసుకున్న తరువాత మీకు స్వతంత్రమైన సుఖం, స్వతంత్రమైన శాంతి, స్వతంత్రమైన ఆనందం కలుగుతుందో దానిని తెలుసుకోండి. తాత్కాలికంగా ఉండే గొడవలతోటి, స్వప్న సమానమైన గొడవల తోటి మనకి పనేముంది జడ్జీగారు అంటున్నారు. మీ దృష్టి అంతా ఆత్మ మీదే పెట్టండి. ఆత్మని చింతించండి, ఆత్మని ధ్యానం చెయ్యండి, ఆత్మ కోసం జీవించండి, అవసరమైతే ఆత్మ కోసం ప్రాణం పోగొట్టుకోండి. మీ లక్ష్యం ఆత్మ జ్ఞానమే, మీ లక్ష్యం ఆత్మ సంపదే. మీరు మాట్లాడినా, కృషి చేసినా, దానిని దృష్టిలో పెట్టుకోండి, ఈ చిల్లర గొడవలలోకి వెళ్ళకండి. సింహం దగ్గరకి మేకలు రావు, గొర్రె పిల్లలు రావు. అదేవిధంగా ఆత్మానుభవం ఎప్పుడైతే పొందారో అప్పుడు మీరు అనుకునే ఈ చిల్లర గొడవలు అసలు రానే రావు. మిమ్మల్ని బంధించే గొడవలు మీ దగ్గరకి రానే రావు. మీరు బంధింపబడడం మీ చేతిలోనే ఉంది, మీరు ముక్తి పొందడం కూడా మీ చేతిలోనే ఉంది. మీకు అక్కర్లేని గొడవలు స్మరిస్తూ బంధింపపడతారా? లేకపోతే ఆత్మని స్మరిస్తూ, ఆత్మని ధ్యానం చేస్తూ, ఆత్మని ఎరుకలోకి తెచ్చుకుని ముక్తి పొందుతారా జడ్జీగారు? ఈ రెండు పనులు మీ చేతిలోనే ఉన్నాయి. అది చేసినా మీ ఇష్టమే, ఇది చేసినా మీ ఇష్టమే అని చెబుతూ, ఏది ఎప్పుడూ ఉంటుందో దానిని పొందడం వలన మనకిలాభం కానీ ఒకరోజున ఉండి మరొక రోజున పోయేదానిని సాధన చేసి పొందినా ఏమి లాభం ఉంటుంది? అటువంటి విషయాలను మనం కష్టపడి పొందినా నాలుగు రోజులు ఉండి ఐదో రోజున పోతుంది. అందుచేత ఆత్మ కంటే తక్కువ విషయాల జోలే మనకి అసలు అక్కర్లేదు అంటున్నారు.

దేహయాత్ర కోసం మీ పనేదో మీరు చూసుకుని మిగతా మీ దృష్టి అంతా ఆత్మ మీదే పెట్టండి. దేనిని తెలుసుకున్న తరువాత మీరు బంధం నుండి బయటకి వస్తారో,

దేనిని తెలుసుకున్న తరువాత శాశ్వతమైన శాంతి, శాశ్వతమైన ఆనందం మీరు పొందుతారో, దేనిని తెలుసుకున్న తరువాత మళ్ళీ శవాలని తొడుక్కుని భూమి మీదకి రావక్కర్లేదో, అటువంటి వస్తువును పొందటం యందే మీ లక్ష్యం పెట్టుకోండి. అది లక్ష్యంగా పెట్టుకుంటే మీరు ఎప్పుడైనా కాలు జారినా, ఆ లక్ష్యం జ్ఞాపకం వస్తుంది. అందుచేత ఎప్పుడైనా ప్రమాదవశాత్తు కాలుజారినా ఆ లక్ష్యం మీకు జ్ఞాపకం వచ్చినప్పుడు మళ్ళీ కాలు కూడదీసుకుంటారు. ఆత్మ లక్ష్యం మీకు లేదు అనుకోండి, కాలు జారితే చతికిలపడతారు.

ఇక్కడ భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే నీ కుయుక్తుల వల్ల, కుతంత్రాల వల్ల ఆత్మ తెలియదు. Arguments వల్ల ఆత్మ తెలియదు. మనస్సు అణిగితే ఆత్మ తెలుస్తుంది. నీకు ఇంద్రియాలు నిగ్రహంలోకి వస్తే, మనస్సు నిగ్రహంలోకి వస్తే ఆత్మ తెలుస్తుంది. అంతేకానీ కోర్టులో ఆర్గుమెంట్ చెప్పినట్టు ఆర్గుమెంట్ చెప్పటం వలన ఆత్మ తెలియదు. ఆత్మ ఎక్కడో దూరాన లేదు. అది మన లోపలే ఉంది. అది సంశయం పెట్టుకుంటే తెలియదు. మన లోపల ఆత్మ ఉందా, లేదా? మన హృదయంలో దేవుడు ఉన్నాడా, లేడా? అనుకునే అనుమానస్తులకి, సందేహస్తులకి తెలియదు. మీకు అర్థం అవుతోందా? అనుమానించే వాడికి, సందేహించే వాడికి ఈ లోకం లేదు, పరలోకం లేదు. ప్రతీ విషయంలోనూ సందేహించే వాడు ఈ లోకంలో ఏమి సాధించలేడు, వాడికి పరలోకం కూడా లేదు.

ఇక్కడ భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే, మీలో ఒక నగ్నసత్యం ఉంది. అది లేకుండా మీరు లేరు. ఆ నగ్నసత్యం మీ హృదయంలో కనుక లేకపోతే మీకు నేను అనే తలంపే రాదు. ఆ నగ్నసత్యం చర్చల వల్ల, వాదనల వల్ల, సందేహాల వల్ల తెలియదు. భగవంతుడు నా హృదయంలో ఉన్నాడా? లేడా? అని అనుమానాలు పెట్టుకుంటే వాడు దొరకడు. ఉన్నాడా? లేడా? అనుకునే వాడు ముందు ఉన్నాడు అనే నిశ్చయానికి రావాలి, భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని conclusionకి రావాలి. Arguments వల్ల వాడు నీకు తెలియబడడు. అణిగిన మనస్సు, నియమింపబడిన మనస్సు మాత్రమే అంతర్ముఖం అవుతుంది. అంటే మనసు ఎవడికి అయితే లోపలకి ఉపసంహరింప బడుతుందో, వాడికి మాత్రమే వస్తువు తెలియబడుతుంది. అందుచేత మీరు అవసరం లేని విషయాలు

వదిలేయండి. పొల్లుని వదిలేసి గింజ పట్టుకోండి. మనం ఏమి చేస్తాం అంటే గింజలు వదిలేసి పొల్లు పట్టుకుంటున్నాము. పొల్లు గొడవలు అన్నీ వదిలేయండి. కావలసినది ఏదో మీరు చూసుకోండి, మీ లక్ష్యమేదో ఒకటి పెట్టుకోండి. ఆ లక్ష్యం కోసం జీవించడానికి ప్రయత్నం చేయండి. దానికోసం మీరు dedicatedగా పనిచేయండి. ఆ చేసేపని ఇష్టంగా చేయండి, ప్రీతిగా చేయండి. ఏ పనైతే శాస్త్రం చెయ్యమని చెప్పిందో ఆ పని చెయ్యి, ఏదైతేచెయ్యకూడదని శాస్త్రం చెప్పిందో అది మానేసెయ్యి. ఆ రకంగా నువ్వు సాధన చేస్తే, నీకు ఆ వస్తువు తెలుస్తుంది. అందుచేత శాస్త్రం కూడా మనకి తల్లి లాంటిది.

తల్లి ఏవిధంగా అయితే తన బిడ్డ క్షేమం కోరుతుందో, అలా శాస్త్రం కూడా మన క్షేమం కోరి చెబుతుంది. ఆ శాస్త్రం ఎంత విశాలబుద్ధి తోటి చెప్పిందో, అంత విశాలబుద్ధి, అంత దూరదృష్టి మనకి లేక, అంటే మన మనసులో ఉన్న ఇరుకు వల్ల, మన మనస్సులో ఉన్న కురచతనం వల్ల మనం పాడైపోతున్నాం. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకుని, పెద్దలని ప్రమాణంగా పెట్టుకుని, జ్ఞానులు చెప్పిన మాటలని ప్రమాణంగా పెట్టుకొని నువ్వు కనుక అలా నడుచుకుంటే, నీకు ఒక్క జన్మలోనే బ్రహ్మానుభవం కలగకపోయినా, ఆ బ్రహ్మానుభవం తాలూక శాంతి, ఆనందం, దాని జాడలు అన్నీ తెలుస్తాయి అంటున్నారు భగవాన్. బాగా వంటిల్లులోకి వెళ్ళిపోవక్కర్లేదు నువ్వు, వంటిల్లు ఇంకా కొంతదూరం ఉండగానే ఆ కూర వాసన ఎలా తగులుతుందో మనకి, అలాగ నువ్వు బ్రహ్మంకి కొంచెం దగ్గరగా వెళ్ళినప్పటికీ, దాని తాలుకు calmness, దాని తాలుకు peace, దాని తాలుకు immortality, దాని తాలుకు ఆ energy, ఇవన్నీ కూడా వస్తువు దగ్గరకి వెళ్ళిపోవక్కర్లేదు, కొంచెం దూరంలో ఉన్నప్పటికీ ఆ వాసన నీకు తగులుతూ ఉంటుంది, అందుచేత నువ్వు ఏమి చెయ్యాలి అంటే, నీకు మామూలుగా ఏ వశిష్టుడో, లేకపోతే ఏ రాముడో, లేకపోతే ఏ కృష్ణుడో అటువంటి స్నేహాలు నీకు దొరకకపోవచ్చు. కనీసం ఆ వస్తువు అనుభవంలోకి వచ్చిన వాళ్ళు కూడా నీకు దొరకకపోవచ్చు. కూర దగ్గరకి వెళ్లకపోయినా ఆ కూర వాసన చూసేవాళ్ళు కొంతమంది ఉంటారు. వాడినైనా పట్టుకుని వాడి స్నేహాలు చేసి బాగుపడవయ్యా అంటున్నారు. కూర తినకపోయినా, ఆ కూర వాసన బట్టి కూర ఎలా ఉంటుందో వాసన చూసిన వాడికి

తెలుస్తుంది. తింటే ఎలాగూ తెలుస్తుంది అనుకోండి, తినకపోయినా కొంచెం వాసన చూసిన వాడికి తెలుస్తుంది. ఆ కూర తిన్నవాడు నీకు దొరకకపోయినా, ఆ కూర వాసన చూసినవాడు ఎక్కడైనానీకు దొరికితే, వాడిని పట్టుకుని తంటాలు పడండి అంటున్నారు. పాపం ఆ జడ్జీగారికి చంటి పిల్లవాడికి చెప్పినట్టు చెబుతున్నారు.

బాహ్యంగా ఆయన జడ్జీ అయినప్పటికీ LKGలో ఉన్న పిల్లవాడికి టీచర్ ఎలా చెబుతాడో, అలా భగవాన్ ఆయనని దగ్గరకి తీసుకుని, హృదయంలోకి తీసుకుని చెపుతున్నారు. గురువు అంటే ఎవడంటే, ఎవడికైతే వాడు పాఠం చెబుతున్నాడో, వాడికి తన హృదయాన్ని ఇచ్చి, తనకి దూరంగా ఉంచడం కాదు, తన హృదయంలోకే తీసుకుని, అతనికి ఎక్కడైతే చాపల్యం వస్తుందో, ఎక్కడైతే సందేహాలు వస్తున్నాయో, ఆ సందేహాలు అన్నీ కూడా జాగ్రత్తగా తొలగిస్తూ, అతనిని తొందర పెట్టకుండా, అతనిని హృదయానికి హత్తుకుని, అతనిని తనంతటి వాడిగా చెయ్యడానికి ప్రయత్నం చేస్తాడు, వాడే గురువు.

**ఓం ఓం ఓం ఓం ఓం**

**శాంతిః శాంతిః శాంతిః, శాంతిః శాంతిః శాంతిః, శాంతిః శాంతిః శాంతిః**


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**


అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

దిll **21-07-2024** ఆదివారం **గురుపూర్ణిమ మహోత్సవం**

సందర్భంగా **శ్రీ రమణక్షేత్రం, జిన్నూరు**లో జరుగు కార్యక్రమములు

| | | |
|---|---|---|
| ఉదయం గంll 6-00లకు | - | **పారాయణం** |
| గంll 6-45 నిllలకు | - | **శేష మరియు నెమలి వాహనములపై గిరి ప్రదక్షిణ** |
| గంll 7-00ల నుండి | - | **అల్పాహారం** |
| గంll 7-30 నిllలకు | - | **పూజా కార్యక్రమాలు** |
| గంll 9-00ల నుండి గంll 11-00ల వరకు | | **సత్సంగం** |
| గంll 11-00ల నుండి | - | **అన్న ప్రసాదం** |

**భక్తులందరికీ ఆహ్వానము**



దిll **23-05-2024** గురువారంనాడు బుద్ధపూర్ణిమ సందర్భంగా

శ్రీరమణక్షేత్రం జిన్నూరు నందు దీపం

# బంధము - మోక్షము

మూల తలంపే మనస్సు అని పేర్కొన్నారు సద్గురువు శ్రీనాన్నగారు. మూలతలంపు, అహంకారం, మనస్సు, అహంభావన అన్నీ పర్యాయపదాలే. అదేవిధముగా "అహమపేతకం నిజవిభానకం" అన్నారు భగవాన్ ఉపదేశసారంలో. అనగా ఆత్మలాభానికి, జీవత్వాన్ని నష్ట పరచుకోవాలి. మనము మనస్సును భద్రంగా ఉంచుకొని శాంతి లభించాలను కుంటున్నాం. మన స్వరూపంగానే ఉన్న శాంతికి అడ్డుగా నిలిచేది మనస్సే అని తెలుసుకుంటే, శాంతిని బాహ్యంలో వెతకటం మానేసి, మనస్సును అంతర్ముఖం చేసి, దాని మూలములో నశింపజేసే ప్రయత్నం చేస్తాం, అట్టి ప్రయత్నమే నిజమైన ప్రయత్నం. మనోమూలములోనే బ్రహ్మము స్వరూపంగా ఉంది. దానిని గ్రహించకుండా మనస్సును ఇంద్రియాల ద్వారా బహిర్ముఖం చేస్తే, మెడలో ఉన్న హారాన్ని అది ఉందని మరచి దానిని పోగొట్టుకున్నట్లు భావించి, ఊరంతా వెతికినట్లుంటుంది. అదే మనము చేస్తున్న పొరపాటు, ముక్తికి అడ్డుపడేది మన అహంకారమే. ప్రయత్నము, గమ్యము, కాలము, ఇత్యాది చట్రాన్ని అతిక్రమించాలి, ఇవన్నీ మనస్సు పరిధిలోనివే. మనస్సు కేంద్రముగా చేసే ఏ సాధన అయినా మనస్సు అస్తిత్వాన్ని మరింత బలపరుస్తుంది. మనస్సు దాని మూలము మీద కాకుండా, బాహ్యముగా విషయాల మీద ఎక్కడ వాలినా మనకు వైరాగ్యం లేనట్లే. బంధము, మోక్షము అనేవి సాపేక్షికాలు, అవి ద్వంద్వాల లోనివే. మోక్షం అనేది ఒక గమ్యం కాదు, ముక్తికి ఏ మార్గము లేదు, ముక్తిని కోరుకొనే వాని స్వరూపమే ముక్తి. మనస్సు నశించిన చోటే ముక్తి తానుగా స్ఫురిస్తుంది. కాబట్టి సాధన ద్వారా మనము పోగొట్టుకోవలసినదే ఉంది. ఆరోజుకారోజు దేహ వాసన తగ్గాలి, అనగా దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందాలి. దేహము పట్ల, లోకము పట్ల అనగా తాను కాని వాటిపట్ల ఆత్మబుద్ధి ఉన్నంతకాలం, ఆత్మపట్ల ఆత్మబుద్ధి కలదు. మనము సమాజరూపంలో ఉన్న దైవాన్ని ఆరాధించాలి. అందరి క్షేమాన్ని కోరుకోవాలి. స్వరూపంలో దుఃఖము లేదు, దేహము జడము, మరి మధ్యలో అవాంతరముగా ఉదయించే దేహపరిమితమైన నేనుకే దుఃఖం. కాబట్టి ఇప్పుడే, ఇక్కడే దేహము జీవించియుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందటానికి తగిన ప్రయత్నము చేసి విడుదల పొందాలి. అట్టి మన ప్రయత్నానికి నిరంతరం గుర్వనుగ్రహం ఉండనే ఉంది. తాను ముక్తుడనని అంగీకరించకపోవడమే బంధం, అంగీకరిస్తే అదే మోక్షం.

**(ఓం తత్ సత్)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**